ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంక్రాంతి శోభ
తుని పట్టణం అంబాజీపేటలో సంక్రాంతి వేడుకల్లో మహిళలు

బరి తెగించారు!


కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఆదివారం కోడి పందాలు జరుగుతున్న దృశ్యం


పిఠాపురం పట్టణ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాలు

- యథేచ్ఛగా కోడి పందాల జోరు
- అదే రీతిలో గుండాటలు.. అక్కడక్కడ దాడులు
- తొలి రోజే కోట్లాది రూపాయల లావాదేవీలు
- తలొగ్గిన పోలీసు యంత్రాంగం

సంప్రదాయ పేరుతో కోడి పందాలు నిర్వహిస్తే కఠినంగా శిక్షిస్తాం.. అటు నిర్వాహకులతోపాటు పాల్గొన్నవారిపైనా కేసులు పెడతామని పోలీసు అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా నిర్వాహకులు వాటిని ఏమాత్రం ఖాతరు చేయలేదు. గుండాటపై పోలీసులు దాడులు నిర్వహించినా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చివరకు వారు తలొగ్గక తప్పలేదు. కోడి పందాలు, జూదక్రీడలను నిర్వహించడంలో పందెంరాయుళ్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని భోగి పండుగ ఒక్కరోజులోనే కోడి పందాలు, గుండాట, పేకాటల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఇప్పుడు ఊరూరా కోడిపందాలు, గుండాటలు ఒక జాతరలా సాగుతున్నాయి.

సర్పవరం జంక్షన్, జనవరి 14: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆదివారం కోడి పందాల జాతర జరిగింది. ఏదిఏమైనా పందాలు, జూదక్రీడలు జరగనిచ్చేది లేదని హెచ్చరికలు చేసిన పోలీసులు భోగి రోజు ఉదయం నుంచే మౌనం వహించారు. కొన్నిచోట్ల గుండాటలపై మాత్రం పోలీసులు దాడులు కొనసాగించారు. అవి కూడా రాజకీయ జోక్యం, ఒత్తిళ్ల మధ్య ఆ సంఖ్య సాయంత్రానికి తగ్గిపోయింది. కాకినాడ రూరల్ మండలంలో ఏటా మాదిరిగానే యథేచ్ఛగా కోడి పందాలు జరిగాయి. ఈ మండల పరిధిలో నేమాం, తిమ్మాపురం, పండూరు, వలసపాకల, సర్పవరం, గైగోలుపాడు సెంటర్, కొత్తూరు, చీడిగ, తూరంగి, కొవ్వూరు, తారకరామనగర్‌లతోపాటు అర్బన్ పరిధిలోని గొడారిగుంటలో కోడిపందాలు, గుండాట నిర్వహించారు. సర్పవరం, తిమ్మాపురం, వలసపాకల, వాకలపూడి, చీడిగ తదితరచోట్ల భారీస్థాయిలో కోడిపందాలు, గుండాటలు జరిగాయి. పందాల వద్ద మద్యం అమ్మకాలు సైతం జోరుగా సాగడంతో ఒక్క రోజులోనే కోట్లాది రూపాయలు చేతులు మారాయి. పందాలను తిలకించేందుకు హైదరాబాద్, విశాఖతోపాటు ఇతర జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. పెద్ద బరుల్లో రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు పందాలు నిర్వహించారు. ప్రముఖులు, ఐటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా వీఐపీ పాస్‌లు జారీచేశారు. వీరికి వాటర్ బాటిల్స్, బిర్యానీ, తేగలు, ఫ్రూట్ సలాడ్, జంతికలు, బొప్పాయి, డ్రింక్స్, గారెలు వంటివి ఉచితంగా సరఫరా చేయడం విశేషం. అయితే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మధ్యాహ్నం కాకినాడ డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. సర్పవరం జంక్షన్ సమీపంలో పాత, కొత్త ట్రస్ట్ ఆస్పత్రి సమీపంలో గైగోలుపాడు, సర్పవరం, గొడారిగుంటలో నిర్వహిస్తున్న పందాలు, గుండాటపై దాడులు నిర్వహించి గుండాట బోర్డులను తొలగించి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో చూసీచూడనట్టు వ్యవహరించాలని పోలీసులపై ఒత్తిళ్లు తీసుకురావడంతో గుండాటలు కొనసాగాయి. సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ మాట్లాడుతూ కోడిపందాలు, గుండాట శిబిరాలపై దాడులు చేసి 15 మందిపై ఆరు కేసులు నమోదు చేసి.. రూ.5,250, నాలుగు పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

బరిలోకి దిగిన కోళ్లు..

పిఠాపురం, జనవరి 14: గ్రామాల్లో కోడిపందాలు జాతరలా సాగుతున్నాయి. పోలీసులు హెచ్చరికలు చేసినా పిఠాపురం నియోజకవర్గంలో కోడి పందాలు ఆగలేదు. పందెంరాయుళ్లు కోళ్లను బరిలోకి దింపారు. పిఠాపురం పట్టణంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే కోడిపందాలు జోరుగా సాగాయి. పిఠాపురం పట్టణానికి చేర్చి ఉన్న లేఅవుట్‌స్థలంలో బరులు, టెంట్లు వేసి పందాల నిర్వహణ ప్రారంభించారు. అలాగే చిత్రాడ, పి.దొంతమూరు, వెల్దుర్తి, విరవ, మంగితుర్తి, కోలంక, మల్లాం, నరసింగపురం, గోకివాడ, గొల్లప్రోలు మండలంలో చేబ్రోలు, తాటిపర్తి, చినజగ్గంపేట, చెందుర్తి, దుర్గాడ తదితర గ్రామాల్లో, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పందాలు జరిగాయి.


ప్రభుత్వ నెరవేర్చని జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండబాబు, టీడీపీ నాయకులు

జగన్‌రెడ్డి ఓ కాలం చెల్లిన వస్తువు

- మాజీ ఎమ్మెల్యే కొండబాబు
- భోగి మంటల్లో జీవో ప్రతులు

కాకినాడ, జనవరి14: జగన్‌రెడ్డి కాలం చెల్లిన వస్తువులాంటోడని, ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన జగన్‌రెడ్డి పీడ త్వరలోనే తొలగిపోయి మంచిరోజులు రానున్నాయని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు భోగి సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక మహాత్మా జ్యోతీరావ్‌పూలే విగ్రహం కూడలి వద్ద వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటికిపోయిన రోజే ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అసలైన సంక్రాంతి పండుగని అన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జి, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గావి శివ, నల్లూరి శ్రీనివాస్, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, పసుపులేటి వెంకటేశ్వరరావు, పాలిక నాని పాల్గొన్నారు.

జిల్లా తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో..

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపుమేరకు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో నెరవేర్చని హామీల జీవో ప్రతులను ఆదివారం జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర పావని భోగి మంటల్లో జీవో ప్రతులను వేసి దహనం చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ రాసిన ప్లకార్డులను భోగి మంటల్లో వేశారు.


సామర్లకోట మండలంలో గుండాల జోరు

ఊరూరా ఇటు పందాలు.. అటు గుండాటలు...

పెద్దాపురం/ప్రత్తిపాడు/పెదపూడి/సామర్లకోట/అన్నవరం తాళ్లరేవు/తుని రూరల్/జగ్గంపేట/కొత్తపల్లి/రౌతులపూడి/కరప, జనవరి 14 : సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. పందెంబరుల్లో గుండాటలు నిర్వహిస్తూ లక్షల రూపాయలు చేతులుమారుతున్నాయి. పెద్దాపురం మండలంలో పోలీసులు ప్రేక్షకపాత్రతో సరిపెట్టుకుంటున్నారు. ముందస్తుగానే నిర్వాహకులు పోలీస్ స్టేషనుకు భారీ ముడుపులు సమర్పించినట్టు సమాచారం. ప్రత్తిపాడు మండలంలోని ఏలూరు, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, పెద్దిపాలెం, ఒమ్మంగి, ధర్మవరం, వెంకటనగరం తదితర గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, పేకాటలు జోరుగా సాగాయి. పెదపూడి మండలం రాజుపాలెంలో కోడి పందాల బరిని దున్నేసి వెనుతిరిగిన వెంటనే బరిని సిద్ధం చేసి భారీ ఏర్పాట్లతో పందాలు, గుండాటలు నిర్వహించేశారు. సామర్లకోట మండలంలో పలు గ్రామాల్లోనూ కోడిపందాలు, గుండాటలు జోరుగా జరిగాయి. ఒక్క గుండాటల నిర్వహణ కోసమే ఇక్కడ సుమారు అరకోటి వసూలు చేసినట్టు సమాచారం. అన్నవరం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు, గుండాట జోరుగా నిర్వహించారు. తాళ్లరేవు మండలంలో చొల్లంగిపేట, పటవల, చినవలసల, సుంకరపాలెం, జార్జీపేట గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగాయి. తుని నియోజకవర్గ గ్రామీణ ప్రాంతాల్లో బరులు వద్ద బారికేడ్‌లు, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో కూడా ఈ పందాలు, గుండాటలు నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గంలో లక్షలాది రూపాయల లావాదేవీలు జరిగాయి. కొత్తపల్లి మండలం కొత్తపల్లి, కొండెవరం, గోర్స, పొన్నాడశివారు రావివారిపోడు, రమణక్కపేట గ్రామాల్లో హోరాహోరీగా పందాలు, గుండాటలు జరిగాయి. రౌతులపూడి మండలంలోని గ్రామాల్లో కోడిపందాలు, గుండాట జోరుగా జరిగాయి. కరప మండలంలో పోలీసులు ఎన్ని హెచ్చరికలు, దాడులు చేసినా కోడిపందాలు, గుండాటలు యథావిధిగా జరిగిపోయాయి.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దాడులు

కాకినాడ క్రైం, జనవరి14: జిల్లా పోలీస్‌శాఖ విధించిన ఆంక్షలను ఉల్లంఘించి కాకినాడ, పెద్దాపురం సబ్‌డివిజన్లలో కోడిపందాలు, గుండాట, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న ప్రాంతాలపై ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ ఆదేశాలతో ఆదివారం పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి పందెం బరులను, గుండాటను ధ్వంసం చేశారు. కాకినాడ సబ్‌డివిజన్ పోలీస్ అధికారి (ఎస్‌డిపిఓ) పడాల మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో కాకినాడ రూరల్ మండలం, వాకలపూడి, సర్పవరం గ్రామాలలో అలాగే పిఠాపురం మండలం, ఎఫ్‌కేపాలెం, ఉప్పాడ కొత్తపల్లిమండలం, వాకతిప్ప, కొత్తపల్లి గ్రామాల్లోను, కరప మండలం, గొర్రిపూడి, పెదపూడి మండలం, జి. మామిడాడ, రామేశ్వరం గ్రామాలపై దాడులు చేసి జూదక్రీడలను అడ్డుకున్నారు. పెద్దాపురం సబ్‌డివిజన్ పరిధిలోని సామర్లకొట మండలం ఉండూరు, పనసపాడు గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించారు.


కలెక్టరేట్ సమీపంలో భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

భోగిమంటల్లో ఎస్మా ప్రతులు

కాకినాడ సిటీ, జనవరి 14 : తమ డిమాండ్ల పరిష్కరించాలని అంగనవాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. క్రిస్మస్, నూతన సంవత్సరం సమ్మె శిబిరంలో జరుపుకొన్న అంగన్‌వాడీలు భోగి పండుగ రోజున సైతం నిరసన తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలో సమ్మె శిబిరం వద్ద వేసిన భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేసి ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ మొండివైఖరి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది అంగన్‌వాడీలు ఆకలి మంటలతోనే పండుగను జరుపుకుంటున్నారన్నారు. సమ్మె డిమాండ్లతో వేసిన సంక్రాంతి ముగ్గులు ఆకట్టుకున్నాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మావతి పాల్గొన్నారు.



సంక్రాంతి 'పల్లె పులకింత'

- పల్లెకొచ్చిన పెద్ద పండుగ.. ● పట్టణాలు ఖాళీ.. గ్రామాల్లో కళ కళ ● గ్రామాలకు నగరవాసుల పరుగులు
- ఉరుకుల పరుగుల జీవనానికి కాస్త బ్రేక్.. ● నాలుగు రోజుల ఆనందం కోసం ఎగిరొచ్చిన బంధుగణం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పల్లె వాకిళ్లు పులకరించే రోజు.. నగరవాసులు పుట్టిపెరిగిన మట్టి వాసన గుండెనిండా నింపుకొనే రోజు, సహవాసగాళ్లతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని మనసు తేలిక చేసుకునేరోజు, ఆడాళ్లు కష్టసుఖాలు పంచుకొనే రోజు.. పిన్నీ, మామ, తాత అంటూ పిల్లలు ఇల్లంతా గోల చేసే రోజు.. బావను ఆట పట్టించే మరదళ్లు.. తొడగొట్టే పందెం పుంజు.. మతిపోగొట్టే పడతుల అందాలు.. కొత్త అల్లుళ్లు.. అత్తవారి వంటకాలు.. మామగారి మర్యాదలు.. అమ్మమ్మ ఆశీస్సులు.. తాతయ్య మొట్టికాయలు.. ఒకటేమిటి పట్టణాల పరుగుల జీవనంలో కోల్పోయే మమకారం, ఆప్యాయత, అనురాగం, ఓదార్పు, మనశ్శాంతిని మూడురోజుల్లో మళ్లీ రీచార్జ్ చేసే రోజు సంక్రాంతి. ఈ ఏడాదీ ఆ ఉత్సాహం పల్లెలకు ఉరుకుల పరుగున వచ్చేసింది. పల్లె ఒడిలో కల్మషం లేకుండా దొరికే కలగలుపు కూర కోసం అను బంధాలు రెక్కలు కట్టుకుని వాలిపోయాయి. భోగి రోజున అర్ధరాత్రి నుంచే భోగి మంటలను వెలిగించారు. చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి మురిసిపోయారు. భోగి రోజున బంధువులు కొందరు చేరుకోవడం ఆలస్యమైనా సంక్రాంతికి బాంధవ్యం చెంత చేరిపోయారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, అరిసెలు, పొంగడాలు, జంతికలు, కజ్జికాయలు ఆశ్చర్యంగా చూస్తూ ఈ తరం పిల్లలు వాటి తెలుగు పేర్లను సెల్‌ఫోన్‌లో ఇంగ్లీషులో తర్జుమా చేసుకొని తెలుసుకోవడంలో బిజీ అయిపోయారు. బావా బామ్మర్దులు, అన్నాదమ్ములు.. ఇలా పందెం పుంజులను యుద్ధాలకు తీసుకెళ్లడానికి సిద్ధమైపోయారు. పల్లె వాకిళ్లు గంగిరెద్దులు తొక్కడం కోసం గొబ్బెమ్మలను సిద్ధం చేసుకున్నాయి. ఇంకేముంది పట్టణాలు బోసిపోగా.. పల్లెల్లో సంక్రాంతి సందడి ఉట్టిపడుతోంది. పండుగ శోభ పరవశింపజేస్తోంది.

● సంబరాల కోసం పరుగున

అన్ని పండుగల్లో సంక్రాంతి పండుగ భిన్నమైనది. వినాయకచవితి, కృష్ణాష్టమి, దీపావళి మాదిరిగా కాకుండా సంక్రాంతి పూర్తిగా సంబురాల పండుగ. ముఖ్యంగా ఐదేళ్ల నోట్లోకి వెళ్లడానికి కారణమైన పంట పొలాలు, పశువులకు కృతజ్ఞతలు తెలుపుకొనే గొప్ప రోజు. పల్లె రుణం తీర్చుకొనే రోజు. అందుకే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఈ నాలుగు రోజులూ సరదా సంతోషాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదంతా ఉరుకులతో గడిపే పట్టణవాసానికి ఏడాదికి మూడు రోజులు సెలవిచ్చి ఈ ఉల్లాసం కోసం ఉత్సాహంగా సొంతూళ్లకు.. పల్లెల్లోని బంధువుల ఇళ్లకు పరుగున వచ్చేస్తారు. ఒకరకంగా తెలుగువారింట ఈ పెద్ద పండుగ బంధాలకు కావలి కాస్తుందంటే అతిశయోక్తి కాదు.

● ఎలాగైనా వెళ్లి రావలె..

రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్, బస్సుల్లో జాగా లేదు, విమానంలో సీట్లు లేవు, హైవేపై కార్ల క్యూ.. అయినా.. ఎలాగైనా వెళ్లి రావలె.. అదే సంక్రాంతి గొప్పతనం. సంక్రాంతి వచ్చిందంటే ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో సందడి మాటల్లో చెప్పేది కాదు. కన్నుల పండువను కళ్ల ముందుకు తెస్తోంది.



అందువల్ల జీవనోపాధికి ఎంత దూరంలో ఉన్నా సంక్రాంతికి సొంతూరుకు చేరుకోవాల్సిందే. మూడు రోజులూ బంధువులతో ఎంజాయ్ చేయాల్సిందే. దీంతో కాస్త కష్టం అనుభవించి నా పల్లెకు చేరుకున్నాక ప్రయాణ బడలికను పండుగ సరదాల్లో కలిపేస్తున్నారు. పండుగకు రెండు మూడు నెలల నుంచే రైళ్లకు రిజర్వేషన్ చేయించుకున్నా కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఇబ్బందులు పడుతూనే పల్లెబాట పట్టారు. పండుగకు ఎక్కువగా హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడ స్థిరపడిన గోదారోళ్లు పెద్ద పండక్కి అరు నూరైనా.. నూరు నూటపాతికైనా వచ్చి వెళ్లాల్సిందే. ప్రత్యేక రైళ్లు వేసినా.. ఆర్టీసీ సుమారు 60 ప్రత్యేక బస్సులను నడిపినా.. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు బాదేసినా.. తిప్పలు పడుతూనే సొంతూళ్లకు వచ్చేశారు. అటు విమానాల్లో కూడా టికెట్లు దొరకని పరిస్థితి ఉన్నా 'తగ్గేదేలె' అంటూ రెక్కలు కట్టుకొని వాలిపోయారు. దీంతో పల్లె తనవాళ్లను చూసి మురిసిపోతోంది.

● సంక్రాంతి నూతన కాంతే కదా!

సంప్రదాయాలు, ఆచారాల్లో భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఇమిడి ఉంటాయని పెద్దల ఉవాచ. సంక్రాంతి అంటే నూతన కాంతి అని అర్థం. పంటలు చేతికొచ్చి గాదెలు ధాన్యంతో కళకళలాడే వేళ. సంక్రాంతిలో నిగూఢంగా ఉన్న మర్మాలు ఉన్నాయి. ఛాందసత్వాన్ని పక్కపెట్టి శాస్త్రీయంగా అర్థం చేసుకుంటే ఆ అంతరార్థాలు ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చని ఆ తరం వారు హితబోధ చేస్తున్నారు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవనంలో.. ఫోనులో ముఖాలను చూసుకుంటూ పలకరింపుల జీవితంలో అసలే బంధాలు పలుచబడిపోయాయనేది ఏవరూ కాదనలేని వాస్తవం. పిల్లలకు చుట్టాలు ఎవరో, ఎవరు వరుసకు ఏమవుతారో తెలియదు. అప్పుడప్పుడు లేదా ఎప్పుడో ఒకసారి ఫోనులో మాట్లాడుకోవడం మినహా మనసులోని మాటలను నేరుగా పంచుకున్నదీ లేదు. దీంతో సంక్రాంతి లేకుంటే అసలే అంతంత మాత్రంగా ఉన్న బంధాలు కాలగర్భంలో కలిసిపోయేవేనని పెద్దలు పడే బాధకు పెద్ద పండుగ కాస్త సాంత్వన చేకూరుస్తోంది. పెద్ద పండుగకు ఇల్లు శుభ్రం చేసుకోవడం.. అనవసరమైన వస్తువులను వదిలించుకోవడం ప్రధానమైనది. మూడు నాలుగు రోజుల నుంచే.. ఒక్కో ఇంట్లో నెల రోజుల నుంచే పండుగ పనులు మొదలు పెడతారు. ఏడాదికి ఒకసారి మెగా స్వచ్ఛభారత్ అన్నమాట. ఇప్పటి తరం వాళ్లకు ముగ్గులంటే తెలియదు. ఒకవేళ అడిగితే రుచి ఎలా ఉంటుందని ఎదురు ప్రశ్నించినా ఆశ్చర్యపోనవసరం లేదు. గతంలో లోగిళ్లలో వేసే ముగ్గులు మహిళలకు సహజ వ్యాయామంగా ఉండేవి. కూర గుమ్మడి కాయ సాధారణంగా అధికశాతం మంది విని యోగించరు. కానీ సంక్రాంతి కలగలుపు కూరలో గుమ్మడి ఉండా ల్సిందే. గుమ్మడి పోషకాల గని అని వైద్యశాస్త్రం చెబుతోంది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఆవులు, గేదెలకు సెలవు వచ్చినట్లే. ఏడాదంతా పశువులు చాకిరీ చేసి ఇల్లు గడవడంలో తోడ్పడతాయి. వాటికి కృతజ్ఞతలు చెప్పుకొనే గొప్పరోజు సంక్రాంతి. అందుకే కనుమ రోజున కాకైనా కదలదనే నానుడి ఉండనే ఉంది. పితృదేవతలను స్మరించుకోవడం సంక్రాతి రోజున అధికశాతం మంది ప్రధానంగా ఆచరిస్తారు. జనసామాన్యంలో మూలన పెట్టుకోవడం అంటారు. కొత్త వస్త్రాలు, పిండివంటలు, కూరగాయలు తదితర పదార్థాలు వారికి నివేదించుకోవడంతో పండుగను ప్రారంభిస్తారు. కోడి పందేలకు తరతరాల చరిత్ర ఉంది. ఒకప్పుడు కత్తులు వాడేవాళ్లు కాదు. కానీ రానురాను కత్తులు కడితేనే కోడిపందేలు అన్నట్లుగా పరిస్థితి పశుహింసకు దారితీసింది. కత్తులు కట్టి, డబ్బులు పెట్టి జూదంగా మార్చేశారు. ఒకప్పుడు ఇద్దరు మనుషులు లేదా ఊళ్ల మధ్య వివాదాలు ఏర్పడితే కోడి పందెం ద్వారా పరిష్కారం చూపే వారు. పౌరుషానికి ప్రతీకగా కోడి పందేలను చూసేవారు. పల్నాటి కాలంలో మాచర్ల, గురజాల జరిగిన గొడవ యుద్ధానికి దారితీయగా పెద్దలు కోడి పందెం ద్వారా సమస్యను పరిష్కరించారని చరిత్ర చెబుతోంది. ఏడాదంతా అమ్మగారింటికి రాకపోయినా సంక్రాంతికి కచ్చితంగా ఆడపిల్లలు పుట్టింటికి వస్తారు. భర్త, ఆయన తరపు వారు కూడా ఈ పండుగ రోజున వాళ్లకు అడ్డుచెప్పరు. అందుకే అత్తవారిల్లు అల్లుడు, కూతురు, పిల్లలతో మూడు రోజులూ కళకళలాడుతుంది.ఇలా భోగి పండ్లు(రేగు), గొబ్బెమ్మలు, హరిదా సులు, గంగిరెద్దులు, గాలిపటాలు.. ఇలా సంప్రదాయంలో దాగి ఉన్న ఆరోగ్య జీవన విధానానికి అవసరమైన ఎన్నిటినో సంక్రాంతి పండుగ మనకు దూరం కాకుండా చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు.. భావితరాలు.. బంధాలకు దూరం కాకుండా పహారా కాస్తోంది.

ఓ రోజు ముందుకు సంక్రాంతి

ఎవరైనా గమనించారా!.. సంక్రాంతి పండుగ ఓ రోజు ముందుకు జరిగింది. జనవరి 14న వచ్చే పండుగ 2008 నుంచీ జనవరి 15న వస్తోంది. ఎందుకంటారా?.. దీనికో కారణం చెబుతున్నారు జ్యోతి ష్కులు. సూర్యుడి ప్రతి ఏడాదీ మకర సంక్రమణం చేసిన రోజున సంక్రాంతి జరుపుకుంటాం. సంక్రాంతి అంటే నూతన కాంతి. ఇలా జరిగే క్రమంలో ప్రతి ఏడాదీ 20 నిమిషాలు ఆలస్యం అవుతుంది. స్థూల గణన చేస్తే మూడేళ్లకు ఒక గంట, 72 ఏళ్లకు ఒక రోజు అవుతుంది. అందువల్ల ప్రస్తుతం జనవరి 15కి జరిగింది. 1935 నుంచీ 2007 వరకూ 72 ఏళ్ల పాటు జనవరి 14న సంక్రాంతి జరుపుకున్నారు. 2008 నుంచి 2080 వరకూ 15న సంక్రాంతి వస్తోంది. 2081 నుంచి 2153 వరకూ మరోరోజు ముందుకు జరిగి 16న ఈ పండుగ జరుపుకుంటారని చెబుతున్నారు.



కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఊరేగిస్తున్న దృశ్యం(ఫైలు)

కొత్తపేటలో నేడు ప్రభల ఉత్సవం

కొత్త పేట, జనవరి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సోమవారం జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలలు నుంచి లక్షలాదిగా సందర్శకులు రానున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు, అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ప్రభల ఉత్సవం జరపడం ఇక్కడ అనాదిగా వస్తోంది. ప్రభల ఉత్సవం మూడు ప్రధాన వీధుల మధ్య పోటాపోటీగా సాగుతోంది. ముందుగా పాత రామాలయం మునసుబు గారి ప్రభ వీరభద్రుని అలంకరించుకుని పురవీధుల్లోకి ప్రవేశిస్తుంది. వాటిని అనుకరిస్తూ మిగిలిన విధుల ప్రభలు సాంస్కృతిక ప్రదర్శన మధ్య ఊరేగింపుగా బయల్దేరుతాయి. బోడిపాలెం ప్రభ భక్తఆంజనేయునిగా అలంకరించుకుని రెండో ఊరేగింపు ప్రారంభమవుతుంది. కొత్తరామాలయం ప్రభ రాజరాజేశ్వరిదేవిగా అలంకరించుకుని ఆయా వీధుల ప్రభలను వెంట బెట్టుకుని మూడవ ఊరేగింపు మొదలవుతుంది. మొత్తం మూడు ఊరేగింపులు కొత్తపేట ఉన్నత పాఠశాల మైదానంలోకి చేరుకుని భక్తుల సందర్శనార్థం కొలువై ఉంటాయి. బాణసంచా పోటాపోటీ కాల్పులు చూపరులను కట్టిపడేస్తాయి. తిరిగి రాత్రి పదకొండు గంటలకు ప్రభల ఊరేగింపు పురవీధుల్లో వివిధ సంస్కృతిక ప్రదర్శనల నడుమ తెల్లవారుజామున నాలుగు గంటలకు పాతబస్టాండు సెంటరుకు చేరుకుంటుంది. పాత, కొత్త రామాలయం వీధుల మధ్య పోటాపోటీ బాణసంచా కాల్పులతో ప్రభల ఉత్సవం ముగుస్తుంది. అమలాపురం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు

- వేడుకలు ప్రారంభించిన తపోవనం స్వామీజీ



రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ

అన్నవరం, జనవరి 14: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వేకువజామున 5గంటలకు స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో వార్షిక కల్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. తపోవనం సచ్చిదానంద స్వామీజీ ప్రత్యేకపూజలు నిర్వహించి భోగిమంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎడ్లబండి, దాన్యపురాసులు, కుమ్మరిచక్రం, బొమ్మలకొలువు, సంక్రాంతి పిండివంటలు, తాటిచెట్టు, ఈతచెట్టు ఏర్పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెటూరు వాతావరణం ప్రతిభింభించే విధంగా ఏర్పాట్లుచేసిన ఈవో రామచంద్రమోహన్‌ను పలువురు అభినందించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన పట్నం భక్తులకు ఆలయప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన పల్లెటూరు వాతావరణం తిలకించి ఆనందించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కళాకృతులు వద్ద స్వీయచిత్రాలు తీసుకున్నారు.

అంతర్వేదిలో కలెక్టర్ దంపతుల పూజలు



కలెక్టరు హిమాన్షు శుక్లా దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ

అంతర్వేది, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఆదివారం కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లాలు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా భోగి పండుగ

- ద్రాక్షారామలో 800 అడుగుల భోగి పిడకల దండ



ద్రాక్షారామలో 800 అడుగుల భోగిపిడకల దండతో కోటిపల్లి కుటుంబ సభ్యులు

ద్రాక్షారామ, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపు రం మండలం ద్రాక్షారామకు చెందిన కోటిపల్లి సత్యనారాయణ, కోటిపల్లి లోవరాజు, కోటిపల్లి రాజు సోదరులు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా పిల్లా పాపలతో కలసి సమీపంలో ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద భోగిమంటలో 800 అడుగుల భోగిదండ వేశారు.

ఏడువేల భోగి పిడకలతో ..



పిఠాపురంలోని కోటగుమ్మం సెంటర్‌లో ఏడువేల భోగిపిడకల దండతో..

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న జైగణేష్ దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగి మంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భోగిమంట చుట్టూ పుష్పాలు, ముగ్గులు, మామిడితోరణాలు, కొబ్బరి ఆకులతో సంప్రదాయబద్ధంగా అలంకారం చేశారు. భోగిమంటల్లో ప్రత్యేకంగా తయారు చేయించిన ఏడువేల భోగిపిడకల దండను తెచ్చి వేశారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్లు వేసి ఆశీర్వాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరుగగా, కమిటీ ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో భోగిదండ ఊరేగింపు..

ఆలమూరు: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో ఉరదాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 600మీటర్ల భోగి దండ తయారు చేశారు. ఆదివారం దానిని మంగళ వాయిద్యాల నడుమ భారీగా ఊరేగించి గుమ్మిలేరు సెంటర్లో ఏర్పాటు చేసిన భోగి మంటలో వేశారు. ఊరేగింపులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సంప్రదాయలను పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఏడు సంవత్సరా లుగా భారీ భోగి దండలు తయారు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ ఈదల శ్రీనివాస్ తెలిపారు.



ఆలమూరు: గుమ్మిలేరులో భారీ భోగిదండను ఊరేగిస్తున్న ఉరదాలమ్మ ఆలయ భక్తులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

- వేలాది తరలివచ్చిన భక్తజనం



గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా గోదా రంగనాథుల దివ్య కల్యాణాన్ని వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రాహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. వివాహం కాని యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు-హైమా పార్వతి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొనగా ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశా రు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలపుతూ ఏర్పాటుచేసిన ఫల, పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్య రామమందిరం చూద్దాం రండి ఫొటో షూట్ వద్ద భక్తులు సందడి చేశారు. మహారాష్ట్రకు చెందిన పూణే కళాకారుల డ్రమ్స్, కేరళ కళాకారుల గరుడ వేషాలు, తమిళనాడుకు చెందిన తాంబులం వాయిద్య కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

పోటా పోటీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ సెమీ ఫైనల్స్ పోటీలు ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఈపోటీల్లో సెయింట్స్ జట్టుపై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై బీఎస్‌ఏ కాకినాడజట్టు, వైజాగ్ జట్టుపై మార్టేరు జట్టు విజయం సాధించాయి. అలాగే రాజమండ్రి సీబీఏ జట్టుపై ఖమ్మం జట్టు, అమలాపురం జట్టుపై రామచంద్రపురంజట్టు, రాజమండ్రి సీబీఏ జట్టుపై హైదరాబాద్ డీబీఏ జట్టు, గుంటూరు జట్టుపై అక్టేరి జట్టు గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. పట్టణ ప్రముఖ డాక్టర్ చెలికాని స్టాలిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

మహాసంస్థానంలో విదేశీ భక్తుల పూజలు

- స్పానిష్ భాషలోకి శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం



స్పానిష్ బాషలోకి అనువదించిన శ్రీపాద శ్రీవల్లభ చరితామృతం పుస్తకాన్ని ఆలయానికి అందజేస్తున్న స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాల భక్తులు

పిఠాపురం, జనవరి 14: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని ఆదివారం పలువురు విదేశీ భక్తులు సందర్శించారు. స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన భక్తులు శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా వారు స్పానిష్ బాషలోకి అనువదించిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకాలను మహాసంస్థానానికి సమర్పించారు. విదేశీ భక్తులను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ రెడ్డెం జనార్థనరావు, కార్య నిర్వహణాధికారి ఆర్.సౌజన్యలు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, మరాఠీ తదితర భాషలతోపాటు పలు దేశీయ భాషల్లో ముద్రించిన విశేష ప్రాచుర్యం పొందిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకం తొలిసారి విదేశీ భాషలోకి అనువదించబడిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎక్కడో మారుమూల పేకాడితే పట్టుకుంటారా?

- కోడిపందాలు, గుండాటలకు మాత్రం అనుమతులా
- సామర్లకోట పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి వీరంగం



పోలీస్ స్టేషన్ వద్ద వీరంగం చేస్తున్న యువకుడు

సామర్లకోట, జనవరి 14: కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసుస్టేషన్ ఎదుట ఒక యువకుడు మద్యం మ త్తులో ఆదివారం వీరంగం చే శాడు. మండల పరిధిలో కోడిపందాలు, గుండాటలను అనుమతించిన పోలీసులు తాను పేకాడుతుండగా పోలీ స్టేషన్‌కు తీసుకొచ్చి సామ ర్లకోట పోలీసులు తనను నిర్బంధించడం పట్ల పోలీ సుస్టేషన్ ఎదుట అలజడి సృష్టించాడు. చొక్కా విప్పుకు ని బ్లేడ్‌తో పొట్టపై కోసుకుంటూ పోలీసులను దుర్భాషలాడుతూ 20నిమి షాలపాటు హల్‌చల్ చేసి ఒక దశలో రోడ్డుపై ఉన్న రాళ్లనుతెచ్చి పోలీ సుస్టేషన్‌పైకి విసిరికొట్టాడు. మండలంలో కోడిపందాలు, గుండాటలు జోరుగా జరుగుతున్న ప్పటికీ ఎక్కడో మారుమూల పేకాడుతున్న తనను ఎందుకు నిర్బంధించారంటూ పోలీసులపై తీవ్రమైన స్వరంతో ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్ని ఆటలు పట్టించండి అంటూ నినాదాలు చేశాడు. ఆ సమయంలో సదరు యువకుడిని నివారించేందుకు స్టేషన్‌లోఉన్న పోలీసులు అంతగా సాహ సించలేదు. కొద్దిసేపటి తర్వాత స్టేషన్ బయటే అతడిని కూర్చొబెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ప్రత్తిపాడు, జనవరి 14: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌లో 16వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరిజిల్లా రంగంపేటకు చెందిన గాజువిల్లి శ్రీను అతడి భార్య అపర్ణ(19) మోటార్‌బైక్‌పై బంధువుల ఇంటికి ప్రత్తిపాడు మండలం రాచపల్లి బయల్దేరారు. ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌వద్ద కంటైనర్ లారీ వేగంగా ఢీ కొనడంతో బైక్‌పై వెనుక కూర్చున్న అపర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. పండుగపూట అమ్మమ్మ ఊరు వెళుతున్న అపర్ణ మృత్యువాత పడడంతో కుటుంబీకులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- భార్య, పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయారని మనస్తాపం



పిఠాపురంలో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

పిఠాపురం, జనవరి 14: కాకినాడజిల్లా పిఠాపురంలోని అగ్రహారంలో సెల్‌టవర్ ఎక్కి ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన పిల్లా దుర్గారావుకు, అతడి భార్యకు ఇటీవల గొడవ జరిగింది. దీంతో పిల్లలను తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్య తనను వదిలి వెళ్లిపోయిందని మనస్తాపానికిగురైన దుర్గారావు సెల్‌టవర్ ఎక్కాడు. భార్య తిరిగి కాపురానికి వస్తేనే తాను దిగుతానని మొండికేశాడు. అక్కడకు చేరుకున్న పిఠాపురం పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్ దుర్గారావుతో చర్చించి కిందకు దింపి పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదానికి గురైన కర్రి అర్జునరావు

గండేపల్లి, జనవరి 14: కాకినాడజిల్లా పెద్దాపురం మండలం నీలాద్రిపేట గ్రామ శివారులో ఆసుపత్రి జంక్షన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నీలాద్రిపేట గ్రామానికి చెందిన కర్రి అర్జునరావు(45) మృతి చెందాడు. స్థానిక పోలీసుల సమాచారం ప్రకారం... అర్జునరావు తన సొంత గ్రామం నుంచి పిండి ఆడించేందుకు జగ్గంపేట వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఆదిత్య జంక్షన్ వచ్చేసరికి రోడ్డు దాటుతున్న సమయంలో రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు వెళ్లే లారీ అతడి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కాగా జగ్గంపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు చనిపోయినట్లు డాక్టర్ ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి ఎస్‌ఐ ఎం.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు పూర్తి

- పలువురు ప్రముఖుల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 14: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. అనారోగ్యం కారణంగా ఆమె శనివారం మృతి చెందిన విషయం విధితమే. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని నివాసం నుంచి ఆమె పార్థివదేహాన్ని ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాస భూమికి తరలించారు. అక్కడ అంత్యక్రియలను దుర్గేష్ తనయుడు డాక్టర్ తేజ పూర్తి చేశారు. తొలుత ఉషారాణి పార్థివదేహాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీఉండవల్లి అరుణ్‌కుమార్, ఎంపీలు మార్గాని భరత్‌కుమార్, పిల్లి సుభాష్ చంద్ర బోస్, డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాల రాయుడు, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు, నగర అధ్యక్షుడు వై.శ్రీను, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, కనకాల రాజా, చేరుకూరి వెంకట రామారావు సందర్శించి నివాళుర్పించారు. దుర్గేష్‌ను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ఆయన కుమారుడు డాక్టర్ తేజను పరామర్శిస్తున్న నాయకులు

కరపలో ముగ్గుల పోటీలు

కరప, జనవరి 14: కరప నక్షత్ర కనస్ట్రక్షన్ అండ్ డెవలపర్ లేఅవుట్లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 200 మంది రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. మొదటి బహుమతిగా జి.నాగమణికి వాషింగ్‌మిషన్, రెండో బహుమతిగా లావణ్యకు మైక్రోవేవ్, మూడో బహుమతిగా డి.లలితకు మిక్సీ అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు కింద చీరలు అందజేశారు. విజేతలకు నిర్వాహకులు తేతాల పద్మశేఖర్ రెడ్డి, శైష శైలజ, దేవు మధు వీరేష్ బహుమతులు అందజేశారు.



తునిలో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

'ఉద్యమాన్ని అణిచివేయడం సిగ్గుచేటు'

తుని రూరల్, జనవరి 14: తమ న్యాయపరమైన హక్కుల కోసం చేపట్టే అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించి ఉద్యమాన్ని అణిచివేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. ఆదివారం తునిలో అంగన్‌వాడీల సమ్మె శిబిరానికి చేరుకుని మద్దతుగా నిలిచారు. అంగన్‌వాడీలు న్యాయపోరాట చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గపు చర్య అన్నారు. పాదయాత్రలో అడ్డుగోలు హామీలు ఇచ్చి సీట్లు, ఓట్లు దండుకున్న ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు మీకు ఈ మౌనం తగునా అని ప్రశ్నించారు. మంత్రుల కమిటీ పిలిచి అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలను అవమానకరంగా మాట్లాడటం ముమ్మాటికి కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. భోగి మంటల్లో ఎస్మా పత్రాన్ని దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలతో కలిసి నినాదాలు చేశారు. యూటీఎఫ్ నాయకులు అప్పలకొండ, ఉపాధ్యాయులు, సీఐటీయూ నాయకులున్నారు.

జీవో నంబర్ 2 ప్రతుల దహనం



ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దాపురం, జనవరి 14: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద నిర్వహించారు. జీవో నంబర్ 2 ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. భోగి మంటలు జగన్‌కు, ఆకలి మంటలు అంగన్‌వాడీలకా అని ఎద్దేవా చేశారు తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు దాడి బేబీ, నాగమణి, ఎస్తేరురానీ, అమల, అంగనవాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, సూరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్'

జగ్గంపేట, జనవరి 14: పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఆదివారం సంత వద్ద ఏర్పాటు చేసిన ప్రాంతంలో అన్న క్యాంటీన్ నిర్వహించారు. టీడీపీ నేత మానేపల్లిసాయి ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, బోండా రాఘేష్, వేములకొండ జోగారావు, రాయి సాయి, డేగల సత్తిబాబు, వీలా మహేష్, నాండ్ల చిరంజీవి, కోడూరి రమేష్, సుంకర రాజు ఉన్నారు.

గౌరీశంకర్ల నాటకోత్సవాలు ప్రారంభం

ప్రత్తిపాడు, జనవరి 14: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ నాటక మహోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల ఆబ్బాయి, ఉపసర్పంచ్ బొల్లు సీతారామరాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు దాట్ల అప్పన్నబాబు, దాట్ల కృష్ణబాబు, దాట్ల భాస్కరరాజు, మాజీ సర్పంచ్ పుణ్యమంతుల కామరాజు, గ్రామపెద్దలు జువ్వల ప్రసాదరావు, ఇంధన ఏసుబాబు, బాబ్జి, పుణ్యమంతుల కుటుంబీకులు సహకారంతో నరసింహ సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు సహాయ సహకారాలు అందించాలని ఉత్సవ కమిటీ సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌లను కోరారు.

ఘనంగా గోదాదేవి కళ్యాణ పూజలు

సామర్లకోట, జనవరి 14: ధనుర్మాసం పర్వదినాలు పురస్కరించుకుని సామర్లకోట సత్యభామా సమేత వేణుగోపాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం గోదా కళ్యాణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఖండవిల్లి వేణుగోపాలాచార్యులు, సుధీర్ వేదమంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తులకు పంచ ద్రవ్యములతో అభిషేకించారు. పుష్పార్చన పూజలు చేసి స్వామి,అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పండితులు హరిబాబు ఆచార్యులు నేతృత్వంలో గోదాకళ్యాణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు, పూలు, పండ్లను దవులూరి సుబ్బారావు అందజేసి పూజల్లో ఆశీనులయ్యారు. అనంతరం నూతన వధూవరులు, యువతులకు, సంతానలేమిదంపతులకు తలంబాల బియ్యాన్ని ప్రసాదంగా అర్చకస్వాములు అందించారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

తుని రూరల్, జనవరి 14: ఎస్.అన్నవరంల పాత బజారువీధిలో గల స్వయంభు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించే వేడుక వైభవంగా చేపట్టారు. వందలాది రకాల పిండివంటలు అమ్మవారికి సమర్పించి అనంతరం గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున తుని పట్టణ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి చండీమేళం

కొత్తపల్లి, జనవరి 14: అయ్యప్పస్వామి మకర జ్యోతి దర్శనంలో భాగంగా కొత్తపల్లి ధర్మశాస్తా ఆలయం, నాగులాపల్లిలో అయ్యప్ప స్వామి చండీమేళం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాగులాపల్లిలో అనిశెట్టి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తయారు చేయించిన అయ్యప్పస్వామి రథంపై స్వామిని ఊరేగించారు. కొత్తపల్లిలో ధర్మశాస్తా అలయ నిర్వాహకులు వెలుగుల వీరవెంకట ప్రసాద్ చండీమేళం నిర్వహించారు. కొత్తపల్లి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, జనవరి 14: రామవరంలో రంగవల్లినగర్ వద్ద ఇటీవల అగ్నిప్రమాదంలో ఏడు కుటుంబాలు సర్వం కోల్పోయారు. దీంతో జగ్గంపేట 14వ వార్డు మెంబర్ ఇంజనీర్ సత్య సదాశివరెడ్డి వారికి 7 మంచాలు, 7 పరుపులు, వంటపాత్రలు అందజేశారు. శివారెడ్డి బాధితులకు చేయూత ఇవ్వడంతో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దంట శివ, ఏసు, రాజనాల లక్ష్మణరావు, కోరాడ చిట్టిబాబు పాల్గొన్నారు.

వైభవంగా భోగి పండుగ



తుని రూరల్: తేటగుంటలో భోగిమంట వద్ద యనమల రామకృష్ణుడు



కొత్తపల్లిలో భోగిమంటల్లో పిడకలు వేసిన చిన్నారులు



పెద్దాపురంలో భోగి పిడకలు వేసేందుకు వెళ్తున్న చిన్నారులు

» వీధుల్లో భోగి మంటలు
» నూతన వస్త్రాలు ధరించి భోగిపిడకల దండలు వేసిన ప్రజలు

పిఠాపురం, జనవరి 14: కాకినాడ జిల్లాలో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పిఠాపురంలో కత్తులగూడెం, గుట్టల వీధి, కుంతీ మాధవస్వామి గుడి వీధి, విద్యుత్ నగర్, సీతయ్యగారి తోట, తారకరామనగర్, డ్రైవర్స్‌కాలనీ, అగ్రహారం, జగ్గయ్యచెరువు కాలనీ, మంగాయమ్మరావుపేట, కచేరిసెంటర్ తదితర ప్రాంతాల్లో భోగిమంటలు వేశారు. తెల్లవారుజాము నుంచే చిన్నారులు, మహిళలు తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలతో భోగిమంటల వద్దకు చేరుకుని భోగిపిడకల దండలు మంటల్లో వేశారు. చిన్నారులపై భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. పలుచోట్ల సామూహికంగా భోగిపండ్లు వేసే కార్యక్రమాలు సాగాయి.

గొల్లప్రోలు: గొల్లప్రోలులో భోగి పండుగ ఘనంగా జరిగింది. అన్ని వీధులు, కూడళ్లలో భోగిమంటలు వేశారు. రెండురోజులు నుంచి కలప దుంగలు తేవడంలో నిమగ్నమైన యువకులు రాత్రంతా జాగారం చేసి తెల్లవారుజామునే భోగిమంట వేశారు. భోగి మంటల వద్దకు ఉదయమే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులు వచ్చి భోగి పిడకల దండలు వేశారు. చిన్నారులకు భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు.

గొల్లప్రోలు రూరల్: మండలంలోని తాటిపర్తి, వన్నెపూడి, చెందుర్తి, దుర్గాడ, చేబ్రోలు, ఏపీ, ఏకే మల్లవరం తదితర గ్రామాల్లో తెల్లవారుజామునే భోగిమంటలు వేశారు. చిన్నారులతో పాటు పెద్దలు మంటల వద్దకు వచ్చి భోగిపిడకలు వేశారు. గ్రామాల్లోని వీధుల్లో ఎంత పెద్ద భోగిమంట వేస్తామనే విషయంలో పోటీపడ్డారు.

తుని రూరల్: తుని పట్టణం, మండలంలోని గ్రామాల్లో ప్రజలు భోగి పిడకలు వేసి భోగి మంటలకు నమస్కరిస్తూ భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని కోరుకున్నారు. ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కుర్చీలు మంటల్లో వేసి కొత్త జీవితాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి తమతమ ఇళ్లలో పిల్లలకు దిష్టి దోషాలు తొలగి ఆయుష్షు పెరగాలంటూ తలపై భోగిపండ్లు వేశారు. రాష్ట్ర ప్రతిపక్ష నేత, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తేటగుంటలో ఆయన అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసి భోగి మంట వద్ద కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ప్రజలకు భోగభాగ్యాలు సిద్ధించాలని ఆకాంక్షించారు.

కొత్తపల్లి: మండలంలో ఇళ్లల్లో పెద్దలు చిన్నారులకు ఉదయాన్నే తలస్నానాలు చేయించారు. ప్రధాన కూడళ్లల్లో భోగిమంటల్లో పిడకల దండలను వేశారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, నాగులాపల్లి గ్రామాల్లో పెద్దలు చిన్నారులకు తలపై భోగిపళ్లను వేశారు.

తొండంగి: భోగి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉదయమే తల స్నానాలు చేసి భోగి మంటల వద్దకు చేరి చలి నుంచి ఉపశమనం పొందారు. చిన్నారులకు భోగి పళ్లు వేసే కార్యక్రమాలు జరిపారు. పలు ఆలయాల్లో గోదా కల్యాణం నిర్వహించారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి తలస్నానాలు చేసి చిన్నా, పెద్దా భోగిమంట వద్ద ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. గృహాల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లు పెట్టి ఆనందించారు.

సామర్లకోట: సామర్లకోట మండలం, పట్టణంలోని పలు కూడళ్లలో భోగిమంటలు వేశారు. ఇంటిల్లపాది తలారా స్నానం చేసి భోగిమంటల వద్దకు చేరుకుని భోగిపిడకలు, పుల్లలు వేసి నమస్కరించారు. పలువురు చిన్నారులకు భోగిపండ్లు పేరిట రేగుపండ్లను శిరస్సుపై వేసి ఆశీర్వదించారు. సామర్లకోటలో అయోధ్యరామపురం నందు భోగిమంటల వద్ద భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయిసత్యనారాయణ దంపతులు కుటుంబంతో భోగిమంటల వద్ద గడిపారు.

రౌతులపూడి: మండల గ్రామాల్లో భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. భోగి మంటల్లో పిడకల దండలు వేసి మంట వద్ద చలి కాసుకున్నారు.

కరప: మండలంలోని భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. యువకులు, పెద్దలు కల్సి తెల్లవారుజామున సేకరించిన దుంగలు, కలప, పిడకలతో భోగి మంటలు వేశారు. చిన్నారులు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి భోగి పిడకల దండలు చేత పట్టుకుని సందడి చేస్తూ భోగి మంటల్లో వేశారు.

కార్పొరేషన్(కాకినాడ): నగరంలోని గాంధీనగర్, రామారావుపేట, ప్రతాప్‌నగర్, ఎల్విన్‌పేట, అశోక్‌నగర్ బానుగుడిసెంటర్, శ్రీరామ్‌నగర్, సాంబమూర్తినగర్, మెయిన్‌రోడ్ బాలాజీచెరువు, సూర్యనారాయణపురం, జగన్నాధపురం పెదమార్కెట్, డైరీఫారం, గొడారిగుంట తదితరప్రాంతాల్లో భారీగా భోగిమంటలు వెలిగించారు.



పిఠాపురంలో భోగిమంట వద్ద మహిళలు



కాకినాడలో భోగిమంటకు నమస్కరిస్తున్న ప్రజలు

సీఎం జగన్‌వి మోసపూరిత మాటలు

భోగిమంటల్లో ప్రభుత్వం జీవోల ప్రతుల దహనం చేసిన టీడీపీ శ్రేణులు



పిఠాపురంలో ప్రతులను దహనం చేస్తున్న వర్మ



జగ్గంపేటలో జీవోలు మంటల్లో వేసిన నెహ్రూ

పిఠాపురం, జనవరి 14: సీఎం జగన్‌రెడ్డి చెప్పేవన్ని మోసపూరిత మాటలు, హామీలేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. జగన్ ప్రభుత్వం జారీ చేసిన ప్రజావ్యతిరేక, మోసపూరిత జీవోలను వర్మ ఆధ్వర్యంలో ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. భోగిసంకల్పం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి పట్టిన జగన్ రెడ్డి కీడు పోవాలి-ఏపీ వెలగాలి అని నినదిస్తూ పట్టణంలో టీడీపీ కార్యాలయం నుంచి వర్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా మెయిన్‌రోడ్డుకు వచ్చారు. ప్రధాన కూడళ్లల్లో ఉన్న భోగిమంటల్లో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన మోసపూరిత జీవోలు, అంగన్‌వాడీ వర్కర్లపై ప్రయోగించిన ఎస్మా ఉత్తర్వుల ప్రతులను వేసి కాల్చివేశారు. వర్మ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదని, చేసినా సొమ్ములు విడుదల కాలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని, టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారం చేపడుతుందని తెలిపారు. ఆందోళనలో టీడీపీ పట్టణ, మండలశాఖ అధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, బర్ల అప్పారావు, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, పంపనబోయిన అన్నపూర్ణ, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీను, మల్లిపూడి వీరబాబు, నల్లా శ్రీను, రావుల రవి, బస్వా నాగసత్తులు, అడ్డగర్ల శివ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట: రావులమ్మ ఆల యం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో భోగి మంటలను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రజావ్యతిరేక జీవోలను టీడీపీ నేతలు భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ పనికి రాని జీవోలను మంటల్లో వేశామన్నారు. రాబోయే రోజులల్లో చంద్రబాబు, పవన్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని దీని కోసం ప్రజలు ఎదరు చూస్తున్నారన్నారు. పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, జీను మణిబాబు, కొత్త కొండబాబు తదితరులున్నారు.

తాళ్లరేవు: టీడీపీ పిలుపు మేరకు భోగి సంకల్పం కార్యక్రమాన్ని పి.మల్లవరంలో టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కీడు పోవాలి-ఏపీ గెలవాలం టూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అంగన్‌వాడీలపై ప్రవేశపెట్టిన ఎస్మా పత్రాలను భోగిమంటలో వేసి తగులబెట్టారు. టీడీపీ కార్యకర్తలు వెంటపల్లి నాగు, ఆనాల పాపారావు, చింతపల్లి అప్పారావు, ఎన్నం రామకృష్ణ,దడాల సత్తికొండ పాల్గొన్నారు.

తొండంగి: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన అనేక ప్రజా వ్యతిరేక జీవోలను టీడీపీ నేతలు, కార్యకర్తలు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఒంటిమామిడిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పేకేటి హరికృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి మురాలశెట్టి సత్యన్నారాయణ, పెదపూడి గవరయ్య పాల్గొన్నారు.

సామర్లకోట: వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలన్నీ ఈ భోగిమంటల్లో కాలిపోవాలని భోగిమంటల్లో సైకో పాలకుల దుర్మార్గపు చట్టాలు, చట ప్రతులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సామర్లకోట మండలం అచ్చంపేటలోని రాజప్ప స్వగృహం ఎదుట భోగిమంటలను ఏర్పాటు చేసి దహనం చేశారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ సామర్లకోట మరం సెంటర్ వద్ద భోగిమంటలో టీడీపీ నాయకులు జీవో ప్రతలను దహనం చేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో రాష్ట్ర సమస్యల ఫొటోలు, జగన్ అమలు చేయని హామీల పత్రాలను భోగి మంటల్లో వేసి ఆందోళన నిర్వహించారు. ధర్మవరంలో అమలాపురం టీడీపీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో భోగి మంటల్లో ఫొటోలు, పత్రాలు వేసి నిరసన తెలిపారు. పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు, ధర్మవరంలో బొల్లు లక్ష్మీరావు, దొడ్డిపట్ల కృష్ణ, పంపబోయిన ఏసుబాబు, ఎం.సీతారామరాజు, జువ్వల దొరబాబు, సిద్దా అప్పలరాజు, చేకూరి ప్రసాదరావు తదితరులున్నారు.



సామర్లకోట: ప్రతులను దహనం చేసిన రాజప్ప



తొండంగి: ప్రతులను దహనం చేస్తున్న నేతలు

'ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'



గొల్లప్రోలులో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, జనవరి 14: రోడ్డు ప్రమాదంలో మరణించిన రెండేళ్ల చిన్నారి శ్రీచైతన్య కుటుంబసభ్యులు, బంధువులు ఆదివారం గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో రెండేళ్ల బాలుడు మరణించగా, భార్య గౌతమి అపస్మారక స్థితికి చేరగా, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భర్త చొల్లంగి వెంకటరమణ, పెద్దకుమారుడు దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మృతిచెందిన చిన్నారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, భార్యాభర్తలకు అయ్యే వైద్య ఖర్చులను భరించాలని, ప్రమాదానికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణం మృతదేహం అప్పగించాలన్నారు. వారితో పోలీసులు చర్చించగా ఆందోళన విరమించారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

గొల్లప్రోలు రూరల్, జనవరి 14: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఆదివారం శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 500మంది పేదలు, వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, పంచెలు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ ఆకొండి వెంకటేశ్వర శర్మ, సభ్యులు బత్తుల వీరభద్రరావు, ఆకుల గంగాధర్, ఆకొండి ప్రభాకరశాస్త్రి, మొగలి వీరభద్రరావు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో భోగిమంటల్లో ప్రతులను వేస్తున్న ప్రతినిధులు

అప్రజాస్వామిక ప్రతుల దహనం

యూటీఎఫ్ నేతల ఆందోళన

గొల్లప్రోలు, జనవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అప్రజాస్వామిక ప్రతులను యూటీఎఫ్ ఆధ్వర్యంలో గొల్లప్రోలులో భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.18వేల కోట్లును తక్షణం ఇవ్వాలని, పీఆర్సీ ఐఆర్ 30శాతం ప్రకటించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఆందోళనలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు, ఎంవీవీ సత్యనారాయణ, ఏ.సీతారామరాజు, దాడి పద్మనాభం, గోవిందరాజు, దాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండాట శిబిరాలపై పోలీసుల దాడులు

పిఠాపురం రూరల్, జనవరి 14: పిఠాపురం మండలం చిత్రాడలో గుండాట శిబిరాలపై ఆదివారం సాయంత్రం కాకినాడ క్రైమ్ డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. పోలీసుల రాకతో నిర్వాహకులు, బెట్టింగ్‌లు కాస్తున్న వారు పరారయ్యారు. అక్కడ ఉన్న బోర్డులను పోలీసులు ధ్వంసం చేశారు.

గండేపల్లి: మండలంలో మల్లేపల్లి కోడిపందాలు, గుండాట శిబిరాలపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ సిబ్బందితో దాడులు చేశారు. నెంబరుగుండు బల్లలను తొలగించి పలువురిపై కేసులు నమోదు చేశారు.

కోడిపందాలపై దాడులు

కాకినాడ రూరల్, జనవరి 14: కాకినాడ రూరల్ మండలంలోని ఇంద్రపాలెం పరిధిలో కోడిపందాలపై ఎస్ఐ మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి 5 కేసులు నమోదు చేశారు. 10 మందిని అరెస్ట్ చేశారు. రూ.6200, 6 కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

1100 లీటర్ల సారా స్వాధీనం

రౌతులపూడి, జనవరి 14: రౌతులపూడి ఎస్సీ కాలనీలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి 1100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్.పైడిపాల నుంచి సారాను కొనుగోలు చేసినట్టు విచారణలో తెలిందన్నారు. 5గురు నిందితులను గుర్తించి ఇద్దరిని అరెస్టు చేశారు.

నేడు 'స్పందన' రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 14: సంక్రాంతి కావడంతో నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్టు కమిషనర్ తెలిపారు.

కరపలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కరపలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కరప, జనవరి 14: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990-91 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు పలకరించుకుంటూ, కరచాలనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన పెంకే సత్తిబాబు, కూనపురెడ్డి వీర్రాజు, దేవు వెంకటేశ్వరరావు, పబ్బినీడి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామకృష్ణ, కె.ప్రసన్నకుమారి కమిటీగా ఏర్పడి అందరూ కలిసేలా ఏర్పాటు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆ నాటి గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధి ప్రధాత నక్క సూర్యనారాయణ మూర్తి, అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద విగ్రహాలకు పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ కుటుంబసభ్యులను గురువులకు పరిచయం చేశారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు, జనవరి 14: 28 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. గొల్లప్రోలులోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో 1995-96లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, ఉపాధ్యాయుల మందలింపులను గుర్తుకు తెచ్చుకుంటూ సరదాగా గడిపారు. కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. నాడు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఇకపై ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.



గొల్లప్రోలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు